క్లుప్తంగా

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 15న విద్యా ప్రాముఖ్యత, మాదక ద్రవ్యాలు–యువతపై వ్యాసరచన పోటీలు, 16న దేశభక్తి, జానపద, భావగీతలు, పాటల పోటీలు, 17న సమకాలీన, సామాజిక అంశాలపై క్విజ్ పోటీలు, కవి సమ్మేళనం, 18న సెల్‌ఫోన్‌తో దారి తప్పుతున్న బాల్యంపై వక్తృత్వ పోటీలు, నాకు నచ్చిన పుస్తకం సమీక్ష, చదరంగం పోటీలు, 19న మహిళ దినోత్సవం సందర్భంగా (బాలికలు) ప్రపంచ ప్రగతిలో మహిళ పాత్ర వ్యాసరచన పోటీలు, 20న ఉదయం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం, గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

దర్శిలో కూడా..

దర్శి: 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు విజయకుమారి తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు విరివిగా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. 20వ తేదీన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వర స్వామికి పూజలు



ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

త్రిపురాంతకం: పట్టణంలో శ్రీ పార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నంది వాహన సేవ అత్యంత వైభవంగా మంగళవారం రాత్రి జరిగింది. భక్తజనులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రత్యేకంగా శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తుల నంది వాహన సేవా వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాల వేద పండితుల మంత్రోచ్చరణలతో పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొని హరహర మహాదేవ శంభో శంకర అంటూ ఉత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై ప్రయాణం నరకం



చాట్లమడ అగ్రహారం వద్ద గుంతలపై వర్షపు నీరు



మద్దలకట్ట సమీపంలో అధ్వానంగా మట్టి రోడ్డు

పెద్దారవీడు: నిధులు మంజూరైనా కూటమి ప్రభుత్వం తారు రోడ్డు వేయాలని దృష్టి సారించడం లేదు. రోజురోజుకూ రహదారి అధ్వానంగా మారుతుండటంతో రాకపోకలు సాగించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మద్దలకట్ట నుంచి చాట్లమడ అగ్రహారం గ్రామం వరకు రోడ్డు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం కోతకు గురై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకాన్ని చూడాల్సి వస్తోందని వాహనదారులు, కాలినడకతో ప్రజలు భయపడుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రహదారి గుంతల్లో నీరు చేరి గొయ్యి ఎక్కడో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. రాత్రిళ్లు అయితే ఈ మార్గంలో ప్రయాణం సాగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గోతులు, కోతకు గురైన రోడ్డు మార్గంలో బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్న దుస్థితి ఏర్పడింది. చాట్లమడ అగ్రహారం నుంచి మద్దలకట్ట వరకు గర్భిణులు, బాలింతలు వైద్యశాలకు ఆటోలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు దెబ్బతింటున్నాయని వాటి యజమానులు రావడం లేదు. కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే ఎంతో కష్టంగా వెళ్తున్నాయి. ఈ రహదారి మార్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు రోడ్డు కష్టాలు లేకుండా చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కింద మద్దలకట్ట గ్రామం నుంచి చాట్లమడ అగ్రహారం గ్రామం వరకు 2.10 కిలోమీటర్ల రోడ్డుకుగానూ రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్డు అభివృద్ధి అంశాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న తమపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కూటమి పాలకులు వెంటనే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి పనులు ప్రారంభించాలి:



మద్దలకట్ట నుంచి మా గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. చాలా అధ్వానంగా తయారైంది. మట్టి రోడ్డుపై అడుగడుగునా గుంతలు కావడంతో మద్దలకట్ట హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు రోజూ నడిచుకుంటూ రాను పోను అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. ఇంత వరకు రహదారి పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నాం.

– బి.వెంకటేశ్వర్లు, స్కూల్ కమిటీ చైర్మన్, చాట్లమడ అగ్రహారం

ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ పోరాటం



నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ఎంఈఓ–2 అమీర్‌బాషాను సన్మానిస్తున్న యూటీఎఫ్ నేతలు

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 1974లో ఆగష్టు 10వ తేదీన ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోంది. నాటి నుంచి నేటి వరకు తనదైన శైలిలో సమస్యలు పరిష్కరిస్తూ నేటికి 50 ఏళ్లు పూర్తయిందని జిల్లా యూటీఎఫ్ ఎన్నికల అధికారి డి.వెంకటరెడ్డి, పరిశీలకులు టి.రాజశేఖర్ కొనియాడారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం, మండల నూతన కౌన్సిల్ నిర్మాణం జరుపుకున్నారు. రాష్ట్రంలో తిరుగులేని ఉపాధ్యాయ సంఘంగా ఎక్కువ సభ్యత్వ సంఘంగా ఉందని, అదే విధంగా త్వరలో కాకినాడలో జరిగేలా గోల్డెన్ జూబ్లీ స్వర్ణోత్సవాలకు మండల శాఖ నుంచి ఆ ప్రాంతానికి వెళ్లి విప్లవాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వక్తలు కొనియాడారు. అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు కటారు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, సహా అధ్యక్షుడు పి.శేషగిరి, కె.లత, ప్రధాన కార్య దర్శి డి.అంజినాయక్, కోశాధికారి ఈ.రోశయ్య, మండల కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్ కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మండల విద్యాధికారి–2 షేక్ అమీర్ బాషాను ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దర్శి యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీను, పి.కాశిం, ఏ.రామారావు, ఆదిమూలపు ప్రభుదాసు, టి.కోటిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటరెడ్డి, రోశయ్య. టి.కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ, వీఆర్వో

కురిచేడు: స్థానిక తహసీల్దార్ రజనీకుమారి ఆదేశాల మేరకు ఆర్ఐ ఆర్. నాజరాజు, వీఆర్ఓ కేవీనాగరాజులు వివాదాస్పద స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. గ్రామ కంఠం సర్వే నంబర్ 178/2 లోని కురంగి వీరయ్య, మస్తానయ్యలకు 5 సెంట్ల స్థలం ఉంది. దానిలో రెండు సెంట్లు స్థలం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయానికి ఇచ్చారు. మిగిలిన స్థలం వివాదాస్పదంగా మారటంతో ఇరువర్గాల వద్ద వివరాలు తెలుసుకున్న ఆర్ఐ నాగరాజు ఇరువురి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి నివేదికను తహసీల్దార్ రజనీకుమారికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచేలా బోధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేలా ఉండటంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఇందిర పెర్కొన్నారు. మంగళవారం మండలంలోని తెల్లగట్ల, ముటుకుల, శతకోడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల వివరాలు తనిఖీ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి నోట్‌బుక్ ప్రతి రోజు సరిచేసి వారికి పలు సూచనలు చేయాలన్నారు. ముఖ్యంగా రాయడం, చదవడంలో వెనకబడి ఉన్నారని, దానిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నేర్పించాలన్నారు. పాఠశాలలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం కూడా ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ పరిశుభ్రమై ప్రదేశంలో తయారు చేస్తూ రుచిగా తయారు చేసి విద్యార్థులకు వండించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చక్కటి బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌లో ఖాతా ప్రారంభించాలి



బ్యాంక్ ఖాతాలు అందజేస్తున్న జేవీ శ్రీనివాసులు

దర్శి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అర్హులు పొందాలంటే ప్రతి ఒక్కరూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకులో ఖాతా ప్రారంభించాలని మార్కాపురం పోస్టాఫీస్ సూపరింటెండెంట్ జేవీ శ్రీనివాసులు తెలిపారు. పట్టణ పోస్టాఫీస్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాలు పొందిన వారు కానీ, రాబోవు కాలంలో పొందే వారు కానీ మళ్లీ సంక్షేమ పథకాలు పొందాలంటే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. ఈ అకౌంట్ ఓపెన్ చేసుకునేందుకు రూ.200 నగదు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ తీసుకుని సంబంధిత పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వద్దకు వచ్చి ఖాతాలు ఓపెన్ చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా యువతీ యువకులకు నిరుద్యోగ భృతి వంటి పథకాలు కూడా ఈ ఖాతాలో వస్తాయన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానికుల ఇచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు.

నామినేటెడ్ పోస్టుల్లో దూదేకులకు ప్రాధాన్యం ఎక్కడ



దూదేకుల ఖాసిం పీరా

పెద్దదోర్నాల: కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో దూదేకుల కులానికి ప్రాధాన్యం దక్కలేదని నూర్ బాషా దూదేకుల మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలోని ముస్లిం, దూదేకులకు 13 కార్పొరేషన్లల్లో చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చారని తెలిపారు. వాటిలో ఆరుగురికి క్యాబినెట్ హోదా కల్పించారన్నారు. శాసన మండలిలో వైస్ చైర్మన్‌తో పాటు రాష్ట్రంలోని టాప్ 10 కార్పొరేషన్లలో ఇద్దరు ముస్లింలకు కేటాయించారన్నారు. జనసేన దక్కించుకున్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఒకరు కూడా ముస్లిం, దూదేకుల కులాలకు లేకపోవటం గమనిస్తే నూర్‌బాషాలు, ముస్లింలపై పవన్ కళ్యాణ్‌కు చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు.

కబడ్డీలో యువకుడి సత్తా



బహుమతులు అందుకుంటున్న కబడ్డీ జట్టు



బల్లాని ఆకాష్

తాళ్లూరు: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హిందుస్థాన్ కబడ్డీ లీగ్‌లో మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన బల్లాని ఆకాష్ సత్తా చాటాడు. ఇతర క్రీడాకారులతో కలిసి తన జట్టును విజయపథంలో నిలిపాడు. కోచ్ అనమర్తలూరి వంశీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. జరగబోయే రెండో సీజన్‌లో రాణిస్తే దేశవాలీ కబడ్డీ స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తమ కోచ్ వంశీ సహకారంలో రాణిస్తున్నట్లు ఆకాష్ తెలిపాడు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన రైతులు



పుల్లలచెరువు: ముటుకులలో రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి



దర్శి: ఉల్లి తెగులుపై సూచనలిస్తున్న ఏఓ బాలకృష్ణనాయక్



పెద్దారవీడు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పుల్లలచెరువు: ప్రతి పంట సాగులోనూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమై అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని బీర్నేనిపల్లి, ముటుకుల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడితే ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో మెట్ట పొలాల్లో వేసిన కంది పంట పూత దశకు చేరినందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పూతకు వచ్చే దశలో మచ్చలపురుగు ఆశించే అవకాశం ఉన్నందున దాన్ని నివారణకు వేప గింజల కషాయం పిచికారీ చేయాలని సూచించారు. తుగు సూచనలకు అధికారులను సంప్రదించాలన్నారు. ఏపీఎంఐ అధికారి శ్రీరామయ్య మాట్లాడుతూ డ్రిప్ పరికరాలు 90 శాతం రాయితీపై అన్ని వర్గాలకు ఇస్తామని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు కొండానాయక్, వెంకటేశ్వర్లునాయక్, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: ఈ నెల 17 నుంచి ఈ–పంట నమోదు చేస్తున్నట్లు రైతులే స్వయంగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ చెప్పారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం పెదన్నపాలెం, గంగదేవిపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న, మినుము, పప్పుశనగ, ఎండు మిరప సాగు చేసిన వారు సమీపంలోని మీసేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలని కోరారు. పొలాల్లో బోర్లు వేసుకున్న రైతులకు సబ్సిడీపై డ్రిప్, తుంపర సేద్య పరికరాలు అందిస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ అధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు. 5 ఎకరాల్లోపు రైతులు 90 శాతం, పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై, 50 శాతం రాయితీతో స్ప్రింకర్లు అందజేస్తామన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన కోరారు. వ్యవసాయ శాఖ గతంలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేసిన నేపథ్యంలో పెదన్నపాలెంలో రైతులకు మట్టి నమూనా విశ్లేషణ పత్రాలు అందజేశారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ మంగళవారం మండల పరిధిలోని యడవల్లి, గంటవానిపల్లెల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి బత్తాయి, మిరప పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటలపై సస్య రక్షణ చర్యలు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవ జీవామృతం తయారు చేసి రైతులకు చూపించారు. ఏఈఓ సంధ్యాబాయి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: కంది మొక్క చికుగుర్లను అడుగు మేర కత్తిరించాలని, దీంతో మొక్క ఏపుగా పెరగడంతో పాటు కాయ తొలచు పురుగును నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొలుకుల, గోళ్లవిడిపి గ్రామాల్లో రైతులు పండిస్తున్న కంది, పత్తి, మిరప పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొగ్గ దశలో పురుగుగుడ్లను గుర్తిస్తే 5 శాతం వేప నూనె, 2.5 మిల్లీ లీటర్లు క్లోరిపైరిఫాస్, లేకుంటే 2 మిల్లీ లీటర్లు క్వినాల్‌ఫాస్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే పురుగులను అరికట్టవచ్చన్నారు. మిరప పంటలో ఎండు తెగులు అధికంగా ఉందని, దాని నివారణకు ప్రోబినెబ్ 2 గ్రాములు లేకుంటే డైఫెనకోనజోల్ 0.5 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, డి.ధనేశ్వర్‌నాయక్, వీఏఏ షేక్ మస్తాన్‌వలి, పి.పార్వతిబాయి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు: నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో మంగళవారం కంభంపాడు పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలకు ఆశించే చీడపీడల నివారణకు మోతాదుకు మించి మందులు వినియోగిస్తే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. అంతే కాకుండా రైతులకు అదనపు పెట్టుబడి భారంతో పాటు పంటను వినియోగించే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. విత్తనశుద్ధి చేశాకే విత్తనాలు విత్తాలని, దీని వల్ల చీడపీడలను అరికట్టవచ్చన్నారు. పొగాకు పంట సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దర్శి: రబీ పంటల ఇన్సూరెన్స్‌లు మీ సేవాలో రైతులు డిసెంబర్ 15లోగా చెల్లించాలని ఏఓ బాలకృష్ణనాయక్ సూచించారు. మండలంలోని తూర్పుచౌటపాలెం, ఉయ్యాలవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్ర సందర్శన చేసి బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ రబీ పంట కాలంలో పొగాకు ప్రత్యామ్నాయ పంటగా శనగ, మినుము, పెసర ఇతర పంటలు సాగు చేయాలని సూచించారు. వరిలో ఆశిస్తున్న ఉల్లి కోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కేజీలు చొప్పున వేయాలని, రీజెంట్, బెల్ట్ ఎక్స్‌పెర్ట్, ఇండోక్సకార్బ మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు ఎవరూ కోతలు కోయరాదని తెలిపారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు: ప్రతి రైతు మిరప పంటపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ బి.ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని రజానగరం, మల్కాపురం, పితాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ మిరప పంటపై తెల్లదోమ రసం పీల్చే పురుగులు, వైరస్ తెగులు వ్యాప్తి వాహకాలుగా పని చేస్తాయని చెప్పారు. వాటి నివారణకు మూడు వరుసలుగా మొక్కజొన్న, వంద బంతి మొక్కలు నాటితే తెగులు అరికట్టవచ్చని చెప్పారు. ముందస్తు చర్యలుగా వేపనూని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వీఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి

● ఆలయాల్లో

ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

పెద్దదోర్నాల: కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు భారీగా చేరుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం, మొట్ల మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల పరిదిలోని మొట్ల మల్లికార్జునపురంలోని మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అశ్విని కుమార్ స్వామి అభిషేకాలు నిర్వహించారు.

పెద్దదోర్నాలలో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గుంటూరు రహదారిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉన్న సంఘటన బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. గుంటూరు రోడ్డులోని ఓ మొబైల్ టిఫిన్ స్టాల్ ఉన్న ప్రాంతంలో చెట్టు కింద మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై మహేష్‌తో పాటు మొబైల్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడికి 65 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. మృతుని ఒంటిపై తెల్ల పంచె, తెల్ల లాల్చీతో పాటు కాఫీ రంగు ఫుల్ డ్రాయర్ ధరించినట్లు తెలిపారు. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.